భావయ్యచౌదరి, కొత్త

ఆంధ్రరాజులు

ఏలూరు, 1929

Record no. 815

Bhāvayyacaudari, Kotta

Āṃdhrarājulu

Ēlūru, 1929

Record no. 815

భావయ్యచౌదరి, కొత్త, 1897-1973.
ఆంధ్రరాజులు / కొట్టా భావయ్య.- ఏలూరు : రామా అండ్ కో., 1929.
50 p. ;19 cm.
Record no. 815

Bhāvayyacaudari, Kotta, 1897-1973.
Āṃdhrarājulu / Koṭṭā Bhāvayya.- Ēlūru : Rāmā aṃḍ Kō., 1929.
50 p. ;19 cm.
Record no. 815

ఆంధ్రరాజులు.

కొట్టా భావయ్యగారిచే.

రచియింపబడియె.

రామా అండ్ కో.,

ఏలూరు.

1929.

 [వెల 0-3-0.

రామా హిందూదేశ చరిత్రలు.

జి. రంగారావునాయుడు గారిచే రివైజుచేయబడినవి.

పురిటి రామమూర్తి గారిచే

నాల్గవ తరగతి (22-12-25)	0	4	0

ఆర్. శేషగిరిరావు, బి. ఎ. యల్. టి. గారిచే

అయిదవ తరగతి (22-12-25)	0	5	0

రామా గుణితబోధినీలు.

మొదటి భాగము	అప్పుడు	10-3-20	0	1	6
రెండవ తరగతి	,,	,,	0	2	0
మూడవ తరగతి	,,	,,	0	2	0
నాల్గవ తరగతి	,,	,,	0	2	0

రామా నాటకముల కథలు.

మొదటి తరగతి	అప్పుడు	22-12-25	0	2	0
రెండవ తరగతి	,,	,,	0	2	6
మూడవ తరగతి	,,	,,	0	3	0
నాల్గవ తరగతి	,,	,,	0	4	0
ఐదవ తరగతి	,,	,,	0	5	0

వలయునారు:— రామా అండ్ కో., ఏలూరు.

ఆంధ్రరాజులు.

కొల్లా భావయ్యా గారిచే

రచియింపబడియె.

రామా అండ్ కో.,

ఏలూరు.

1929.

కాపీ రైటు] [వెల 0—3—0.

పట్టాభి రామా ముద్రాక్షరశాల ఏలూరు.

విషయసూచిక.

ఆంధ్రరాజులు.

1. అనపోత భూపాలుఁడు.

పదునాల్గవ శతాబ్దములో నాంధ్రరాజ్యము రేచర్ల సింగమనాయని కుమారుఁడగు ననపోతభూపాలునిచే గొంత కాలము పాలింపఁబడెను. ఈయన రాజధాని రాచకొండ దుర్గము. ఇది నైజాము ప్రభుత్వములోని నల్లగొండ సీమలో నున్నది. ఇది నారాయణపుర సంస్థానమునకు పశ్చిమముగా నారుమైళ్ళ దూరములో నున్నది.

అనపోత భూపతి పద్మనాయకవంశజుఁడు. బహు పరాక్రమ సంపన్నుఁడు. అందువలన నీతనికనేక శత్రువులుండెడి వారు. క్షత్రియులు, రెడ్లు, మహమ్మదీయులీయనతో నెప్పుడు యుద్ధములు జేయుచునేయుండిరి. ఈతని తండ్రిని మోసముచే శత్రువులు చంపిరి. ఆ విరోధము సాధించుటకై యితఁడు నూటయిరువదియొక్క క్షత్రియులను చంపి వారి రక్తముచే పితృతర్పణము జేసెను. ఈతనికి మాదానాయుఁడను తమ్ముఁడు గలడు. ఇతఁడు గూడ వీరశిఖామణియే.

అనపోతనాయుని సైన్యములో విస్తారము కమ్మనాయకులు, వెలమవారు నుండెడివారు. వీరందఱు సంగ్రామములలో మిగుల నారితేరియుండిరి. అనపోతనాయఁడు జల్లిపల్లి, గోల్కొండ, ఇనుకుర్తి, భువనగిరి, ఓరుగల్లు మున్నగు కోటల నన్నిఁటిని జయించెను. ఇతఁడు క్షత్రియుల పాలిటికి పరశురాముఁడనునట్లుగా వారితో తఱచు యుద్ధములొనర్చుచు వారి కోటలనే స్వాధీన పఱచుకొనువాఁడు. బహుమనీ రాజ్య వంశీయుఁడగు మహమ్మదుషాహ యనువాఁడు కల్బర్గ రాజధానిగా గొంతదేశ మాకాలములో బాలించుచుండెను. ఇతఁడు కొన్నాళ్ళవర కనపోతనాయునితో సఖ్యముగానుండెను. గాని తరువాత విరోధియై యోరుగల్లు దుర్గముపైకి దండెత్తివచ్చెను అప్పుడాంధ్రవీరులుజూపిన బలపరాక్రమముచే నాతఁడు దెబ్బలు తిని పరాజితుఁడై పాఱిపోవలసినవాఁ డయ్యెను.

పరాజితుడైన మహమ్మదుషాహ మఱియొకమారు విశేషసైన్యమును దీసుకొని దండెత్తి వచ్చెను. అప్పుడే కొండవీటి రెడ్డిరాజులకు ననపోతనాయునికిని ధరణికోటవద్ద నొక సంగ్రామము జరుగుచుండెను. ఓరుగల్లు దుర్గాధ్యక్షుఁడు మహమ్మదుషాహ రాకవిని యడవులదారిఁ బట్టెను. అందుచే నీ సందిగ్ధ సమయములో ననపోతభూపాలుఁడు మహమ్మదు షాహాతో సంధిజేసుకొనెను. తరువాత నీతఁడు ఢిల్లీ సింహాసనాధిపతి కియ్యఁదలంచిన రత్నసింహాసనమును మహమ్మదు షాహాకు కానుకగా నిచ్చెను.

కొండవీటి రెడ్డిరాజులగు ననపోతారెడ్డి, అనవేమరెడ్డి యనువారలతో నితఁడు ధరణికోటవద్ద చాలసారులు యుద్ధమొనర్చెను గాని యొకసారి యీతను మఱొకసారి వారును జయమందుచువచ్చిరి.

అనపోతభూపాలుఁడు శైవమతావలంబకుఁడు. భైరవ భక్తుఁడు. అందుచే నీతఁడు తన దేశమున ననేక భైరవప్రతిష్ఠలఁ జేయించెను. ఈతఁడు చాల తటాకములను త్రవ్వించెను. అందులో ననపోతసముద్రము, రాయసముద్రము మొదలైనవి ప్రాముఖ్యములు.

ఇతఁడు శ్రీశైలమునపైకి జనులు సులభముగా నెక్కిపోవుటకై సోపానములు గట్టించెను. మఱియు నితఁ డనేక గో, భూ, హిరణ్య దానములొనర్చెను. ఈతఁడు క్రీస్తుశకము 1303 మొదలుకొని 1381 సం॥ వరకు రాజ్యముచేసెను. రేచెర్ల వంశములో మహారాజను బిరుదువహించి స్వతంత్రముగ బరిపాలించినవారిలో నీతఁడే మొదటివాఁడు. ఈతని ధైర్య సాహసములవల్లనే పెక్కు దుర్గము లీయన జయింపగలిగెను.

2. మంచికొండ ముమ్మడినాయకుఁడు.

రాజమహేంద్రపురమునకు పదునొకండు మైళ్ళ దూరములో కోరుకొండయను దుర్గము గలదు. ఈ దుర్గమును రాజధానిగా జేసుకొని మంచికొండ ముమ్మడినాయకుఁడను రెడ్డిరాజు గోదావరీమండలమును బాలించెను. ఇతని తండ్రి పేరు కూనా రెడ్డి. ఈతఁడే యీ దుర్గమును నిర్మించెను. ఈ కూనా రెడ్డిపేరున గట్టఁబడిన కూనవరమను గ్రామమిప్పటికిని గౌతమీతటమున నున్నది.

ముమ్మడినాయకుఁ డప్పటికాలములో మిక్కిలి ప్రసిద్ధి వహించిన కాపభూపాలుని తోబుట్టు కుమార్తెను పరిణయమయ్యెను. ఈ కాప భూపతికిని ముమ్మడి నాయకునకు నాంధ్ర సురత్రాణయను బిరుదుగలదు.

రాజమహేంద్రిపుర రాజ్యము కూనా రెడ్డికి పూర్వము తురుష్కుల వశమై యుండెను గాని కూనభూపాలుఁడు కాప భూపతి సహాయముచే వారిని జయించి కోరుకొండ దుర్గమును నిర్మింపగలిగెను.

ముమ్మడినాయకుఁ డనేక వైరి వీరుల జయించుటయేగాక విద్యావంతులైన పండితుల కనేకాగ్రహారముల నొసంగి శాస్త్రవిద్యలఁ బోషించుచు వచ్చెను. ఇతఁడార్యవటమున శాసనమొకటి వ్రాయించెను. అందులో నాంధ్రదేశములోని

తన రాజ్యము కొబ్బరి, అరటి, పనస, పోక, మామిడి మున్నగు నానావిధ ఫలవృక్షములు గల్గిన తోటలతో రమ్యముగ నున్నట్లు వ్రాయఁబడెను. నిజముగా గోదావరీమండల మప్పటి నుండి యిప్పటివరకట్లే యున్నది.

ఈయన రాజ్యములో కోనసీమ, అంగరసీమ, కొత్తాము సీమ, కురవాటిసీమ, చాంగలునాటిసీమ మున్నగునవి కలవు. ఇవన్నియు గౌతమీనది కిరుప్రక్కల వ్యాపించియుండెను.

ముమ్మడినాయకుని కిద్దఱు తమ్ములు గలరు. పెద్ద తమ్ముఁడు సింగమనాయకుఁడు. చిన్నతమ్ముఁడు గన్నయనాయకుఁడు. ఈతఁడు పెద్దతమ్ముని తుని సమీపమునగల కోట్యామునందును జిన్నతమ్ముని రాజవోలు తాలూకాలో గల తాడిపాక యందును నిలిపి, తాను కోరుకొండలో నుండి రాజ్యమును మిక్కిలి సామర్థ్యముతో బాలించెను. తరువాత కొంత కాలమునకు పెద్ద తమ్ముని పింపానదీతీరమునకుఁ బంపెను. ఆతఁడచ్చట ముమ్మడిపీడను నొక నూతన పురమును గట్టించి యచ్చటఁ బరిపాలించెను. ఆముమ్మడిపీడను నదియే ముమ్మడివరమని నేటికాలమున వ్యవహరింపఁబడుచున్నది.

ముమ్మడినాయకుని పూర్వులు శివభక్తులు కాని యాతఁడు నీతని సోదరులు వైష్ణవభక్తులైరి. వీరప్పుడు శ్రీరంగమునుండి వచ్చిన యేడవ పరాశరభట్టను వైష్ణవగురువునకు శిష్యులుగా నేర్పడిరి. ఈ వైష్ణవగురువు కోరికచొప్పననే

ముమ్మడినాయకుఁడు కోరుకొండదుర్గముమీద లక్ష్మీనృసింహస్వామి యాలయమును గట్టించెను. ఈస్వామివారి యుత్సవకైంకర్యాదులకై రెండుగ్రామముల నీతఁడు దానము జేసెను. ఈతని సోదరుఁడు సింగమనాయకుఁడొకనాటి సూర్యగ్రహణకాలమున నాయుర్వేద విద్యాప్రోత్సాహమునకై పరహితాచార్యుఁడను బ్రాహ్మణున కక్కులంపూడి యను గ్రామమును దానము జేసెను. దీనినే కొంతకాలము ముమ్మడిసింగవరమని వ్యవహరించుచు వచ్చిరి. ఈదాన శాసనములో ముమ్మడినాయకుఁడును, సింగమనాయకుఁడు నిద్దఱు చేవ్రాళ్లు జేసిరి.

ముమ్మిడినాయకున కైదుగురు కుమాళ్ళు గలరు. అందులో ముగ్గురుమాత్రము రాజ్యము జేసిరి. కూనారెడ్డి, అన్నారెడ్డి, కాటమరెడ్డి యని వారి ముగ్వురి పేర్లు. ఇందులో నగ్రజుఁడగు కూనారెడ్డిగూడ తనతండ్రివలెనె దేవాలయములు గట్టించి భూదానములు జేసెను.

ఈ కోరుకొండ రాజ్యపాలనము ముమ్మిడినాయకుఁడేమి, యాతని సంతతివారేమి విద్యాసక్తితోను, ధర్మానురక్తితోను, భగవద్భక్తితోడను జేసి మిక్కిలి యశము గడించిరి. ముమ్మిడినాయకుఁడు క్రీస్తుశకము 1340 సం॥ మొదలుకొని 1370 సంవత్సరము వరకు రాజ్యమేలెను. ఈతఁడు లక్ష్మీనృసింహస్వామి దేవళమును 1353 సంవత్సరములో నిర్మించెను.

3. దేసటి వేమభూపాలుఁడు.

వేమభూపాలుఁడు కొండవీటి రెడ్డిరాజులలో ప్రసిద్ధపురుషుఁడు. అద్దంకిని రాజధానిగా నేర్పాటుజేసుకొని ఈతఁడు గుండ్లకమ్మ కిరుప్రక్కలనున్న దేశమును పాలించెను. దీనిని పూఁగినాఁడని యాకాలమున వ్యవహరింపఁబడెను. ఇది శ్రీశైలపూర్వతటనికటమునుండి పూర్వసముద్రమువరకు వ్యాపించియుండెను. వేమభూపాలుని తండ్రి దేసటి పోలయయనువాఁడు. ఈతఁడు కాకతీయచక్రవర్తులవద్ద సైన్యాధిపతిగా నుండెను. ఆ రాజ్యము తురుష్కులు భగ్నమొనరించిన తరువాత వేమభూపాలుఁడద్దంకికివచ్చి తన బాహుబల పరాక్రమముచే స్వరాజ్యమును స్థాపించెను.

వేమభూపాలునికి రామాప్రెగడయు నతని తరువాత మల్లినాథుఁడు నను నియోగిబ్రాహ్మణులు మంత్రులుగానుండిరి. ఈయన సైన్యములో ప్రసిద్ధులైన నల్వురు సేనాధిపతులు గలరు. వీరిలో మల్లారెడ్డి, అన్నారెడ్డి యను వారిద్దఱు వేమభూపాలుని సోదరులు. మూఁడవవాఁడాయన కుమారుఁడగు వనపోతరెడ్డి. నాల్గవవాఁడాతని మాతుల పుత్రుఁడగు నూకారెడ్డి. ఈ నల్వురిసహాయముతో వేమభూపాలుఁడు శత్రురాజుల నెల్లరిని జయించి విశేషమైన కీర్తిఁగడించెను. తురుష్కులు కొందఱు బ్రాహ్మణాగ్రహారముల నాక్రమించఁగా నితఁడు

మల్లారెడ్డిని బంపి వారినిఁ బాఱఁద్రోలి యా యగ్రహారములను తిరిగి బ్రాహ్మణుల కిప్పించెను. కాకతీయక్షత్రియులు కొందఱు మోటుపల్లియను గ్రామము నాక్రమింపఁగా నీమల్లారెడ్డియే పోయి వారిని జయించి దానిని స్వాధీనపఱచుకొనెను. ఈ మోటుపల్లి సముద్రము ప్రక్కనున్న యొక రేవుస్థానము. ఆంధ్రదేశమున నిది ద్వీపాంతర వర్తక వ్యాపారములో బ్రసిద్ధి జెందినదిగా నుండెను.

పద్మనాయక వంశజుఁడగు ననపోతభూపాలుఁడు తన తమ్ముఁడగు మాధవనాయనితో గలసి వేమభూపాలుని రాజ్య మాక్రమించుటకై ధరణికోటవద్దకు వచ్చెను. అప్పుడు వేమభూపాలుని కుమారుఁ డనపోతారెడ్డి వారితో ఘోరమైన యుద్ధమునర్చి వారిని బాఱఁదోలెను. కటకాధిపతియగు గజపతిగూడ నొకసారి యాతని రాజ్యముపై దండెత్తివచ్చెను. గాని యాతనినిగూడ నీతఁడే కృష్ణానదీతటమున నోడించెను

ఇట్టి సేనాధిపతుల సహాయముతో వేమభూపాలుఁడు పరరాజుల నవలీలగా జయించుచు కందుకూరు మొదలు గోదావరివరకు గల దేశమంతయు బాలించెను. ఈ రాజ్యము యొక్క విస్తీర్ణము రమారమి 16000 మైళ్ళుండవచ్చును. ఇతఁ డమరావతిలో నొక శాసనము వేయించెను. దానినిబట్టి చూడఁగా పూర్వము ప్రతాపరుద్రచక్రవర్తి బ్రాహ్మణుల కిచ్చిన యగ్రహారములు తురుష్కు లపహరింపఁగా నితఁడు వారిని జయించి మఱల వాటిని బ్రాహ్మణుల కొసంగినట్లు కనుబడును.

వేమభూపాలుఁడు సర్వజన రంజకముగా బరిపాలన చేసెను. ఆంధ్రదేశములో నితఁడు వైదికమతమును, వర్ణాశ్రమ ధర్మములు, విగ్రహారాధనము, శాస్త్రవిద్యలు నశింపకుండ వాటి నభివృద్ధిలోనికిఁ దెచ్చెను. అనేకములైన గుళ్ళు, గోపురములు, చెఱువులు, చలివేంద్రిల నితఁడు స్థాపించెను. విస్తారములైన భూదానములు జేయుటచే నీతని కపరిమిత భూదాన పరశురాముఁ డను బిరుదు వచ్చెను. ఈతఁడు శ్రీశైలముపైనుండి క్రిందనున్న కృష్ణానదిలోనికిని అహోబల నృసింహక్షేత్రమునుండి దిగువవరకును సోపానములను గట్టించెను. మఱియు నమరావతిపట్టణములోని యమరేశ్వర స్వామివారి యాలయశిఖరమున బంగారు కలశములను స్థాపించెను. కృష్ణాతీరమునందాతుకూరను గ్రామమునకు వేమవరమని పేరు బెట్టి దానిని బ్రాహ్మణుల కగ్రహారముగా నిచ్చెను. ఇతఁడు హేమాద్రిధనఖండమునం జెప్పిన వ్రతదానములన్నిటిని జేసెను. చెఱువులు, బావులు విశేషముగా ద్రవ్వించి వ్యవసాయకులకు మహోపకారము జేసెను. వ్యాపారసౌకర్యమునకుగా మార్గము లేర్పఱచెను. ఈతఁడు పూర్వపద్ధతుల ననుసరించియే సుంకములను రాబట్టుచుండెను. రైతుల యుపయోగము కొఱకు బ్యాంకులను నెలకొల్పెను. ఇతని రాజ్యము రామరాజ్యమువలె జారచోరదుర్భిక్షాదులు లేక సుఖప్రదముగ నుండెను.

వేమభూపాలుని కొల్వుకూట మెప్పుడు సంస్కృతాంధ్ర భాషాకోవిదులతోడను, వేదవేదాంగ షట్శాస్త్రవిదులైన

పండితుల తోడను నిండియుండెను. ఈయనవద్ద శంభుదాసను నామాంతరముగల యెఱ్ఱాప్రెగ్గడయను మహాకవి యాస్థానకవీశ్వరుఁడుగా నుండెను. ఈకవిచే వేమభూపాలుఁడు రామాయణమును, హరివంశమును రచింపఁజేసి తానా గ్రంథముల కృతిఁ బొందెను. యెఱ్ఱాప్రెగ్గడ మొదట వేమభూపాలుని తమ్ముఁడగు మల్లభూపాలుని వద్దనుండి క్రమముగా నీతని విశ్వాసమును బడసి సంస్థాన కవీశ్వరుఁడయ్యెను. ఇతఁడే కవిత్రయములోని వాఁడు. వేమభూపాలునకనపోత రెడ్డి, అనవేమ రెడ్డి, కోమటి రెడ్డియును మువ్వురు కొమాళ్లును దొడ్డాంబిక వేమాంబికయను యిరువురు కుమార్తెలును గలరు. కుమార్తెలనిద్దరును కాటయ రెడ్డి, నల్లనూకయ రెడ్డియను వారికిచ్చి వేమభూపాలుఁడు పరిణయ మొనర్చెను. వేమభూపాలునికనేక బిరుదములు గలవు. అందులో నీక్రింద గొన్ని వ్రాయబడినవి.

పల్లవాదిత్యుఁడు, అర్థిప్రత్యర్థి హేమాద్రిదాననిరతుఁడు, అపరిమిత భూదాన పరశురాముఁడు, రాచూరిదుర్గవిభాళుఁడు, అనేకనగరోపకంఠప్రతిపాదిత బహువిధారాముఁడు, విరోధి నృపదానవనరసింహుఁడు, నిత్యపరిపాలిత సత్యుఁడు, జగనొబ్బ గండడు మున్నగునవి.

ఈతఁడు క్రీ. శ 1324—1350 మధ్యపరిపాలన మొనర్చెను. తరువాత నితని జ్యేష్ఠకుమారుఁడనపోతన రెడ్డి రాజ్యమునకు వచ్చెను.

---

4. అనపోత రెడ్డి భూపాలుఁడు.

వేమభూపాలుని జ్యేష్ఠసుతుఁడగు ననపోతరెడ్డి తండ్రి మరణానంతర మద్దంకి రాజధానిగా గల దేశమునంతయు బాలించెను. ఈతఁడును తన తండ్రిపోయిన మార్గముననే ప్రజారంజకముగ రాజ్యపరిపాలన మొనర్చెను.

ఇతని తోబుట్టువుల భర్తలగు కాటయ రెడ్డియు, నల్లనూకయ రెడ్డియు నితని సేనాధిపతులుగా నుండిరి. ప్రచండ సేనానియగు ననవేమ రెడ్డి యను తమ్ముఁడీతనికి విధేయుఁడుగా నుండెను. ఈయన రాజ్య మపహరించుటకై పద్మనాయకులు, రాచవారును ప్రబలప్రయత్నము లొనర్చుచు వచ్చిరి. కాని యాహవనైపుణ్యులగు పై సేనాధిపతుల సహాయముతో నీతఁడు వారిని బారఁద్రోలుచు వచ్చెను. పద్మనాయకవంశజుఁడగు ననపోతనాయఁడును వానిసోదరుఁడు మాదానాయఁడును చాలా సైన్యముతో ధరణికోటను ముట్టడించినప్పుడీ యనపోత రెడ్డిభూపాలుఁడు తన తండ్రికి సేనాధిపతిగానుండి వారల నెదుర్కొని ఘోరమైన సంగ్రామముజరపి వారలను వెనుకకు దరిమెను.

ఈతఁడు తన తండ్రియిచ్చిన యగ్రహారముల నన్నిటిని గాపాడుటయేగాక తానును హేమాద్రిధనఖండమున జెప్పిన ప్రకారము జేసి కీర్తనీయుఁడయ్యెను. ఇతఁడు శివభక్తుండైనం

దున పర్వత మల్లినాథలింగస్వామి, శ్రీగిరిలింగమను శైవ ప్రతిష్ఠాపనలను నెలకొల్పెను. మణికేశ్వరములోని శివాలయమునకు నారామములు భూములున్నగునవి దానముజేసెను.

అనపోతరెడ్డి భూపతి తన రాజ్యములో నౌకావ్యాపారమును విదేశములతో జరుగుయేర్పాట్లు చేసెను. ఆకాలములో మోటుపల్లి నౌకావ్యాపారమునకు ప్రధానస్థలము. ఈయన రాజ్యమునకు పూర్వ మా వ్యాపారము క్షీణించియుండెను. అందుచే దానిని పునరుద్ధరించుటకై యాతఁడు విశేషశ్రమ దీసుకొనెను. వ్యాపారసౌకర్యార్థమై యొక శాసనము స్థిరము గావించెను.

మోటుపల్లి కేవర్తకులు వచ్చి నివసింపఁగోరినను వారిని గౌరవించి భూములు, నివేశనస్థలములు నియ్యబడుననియు, మఱొక స్థలమునకు వారు వెళ్ళఁగోరునప్పుడెట్టి నిర్బంధములు లేక స్వేచ్ఛగా వెళ్ళవచ్చుననియు, ఏయూరిసరకు దెచ్చినను స్వేచ్ఛగా నమ్ముకొనవచ్చుననియు, పన్నులక్రింద వారిసరకులు గ్రహింపబడవనియు, బంగారుసుంకము తీసివేయబడినదనియు, మఱికొన్ని వస్తువులపై గల సుంకము తగ్గించఁబడినదనియు నా శాసనములో వ్రాయఁబడెను. ఈశాసనము 1358 సం॥లో వ్రాయఁబడినది. ఇందులో వ్రాయఁబడిన మోటుపల్లికి ముకుళపురమను నామాంతరముగూడ కలదు. అనపోతరెడ్డికి కుమార

గిరిరెడ్డి యను తనయుఁడును, మల్లాంబ యను కొమార్తెయు గలరు. ఈ కుమార్తెను తన మేనల్లుఁడగు కాటయవేమునకిచ్చి వివాహము గావించెను.

అనపోతరెడ్డి 1350 – 1362 మధ్య ననగా పన్నెండు సంవత్సరములు మాత్రమే రాజ్యముచేసి మృతినొందెను. గాని యాతఁడింకను జీవించియున్నచో తన సామ్రాజ్యమును చాల యభివృద్ధి జేయఁజాలెడివాఁడు. ఈతఁడును తన తండ్రి వహించిన బిరుదముల నన్నిఁటిని ధరించెను.

---

5. అనవేమరెడ్డి భూపాలుఁడు.

అనపోతరెడ్డి భూపాలుని మరణానంతర మాతనికుమారుఁడు చిన్నవాఁడగుటచే తమ్ముఁడగు ననవేమరెడ్డి రాజ్యమునకు వచ్చెను. ఈతని కాలమునగూడ రాచకొండ, దేవరకొండ దుర్గాధిపతులగు ననపోతనాయఁడు, మాధవనాయఁడు నతనికి బలవద్విరోధులై యీయనరాజ్యమాక్రమింపవలెనని యనేకమార్లు దండయాత్రలు చేసి యీయనతో ఘోరమైన యుద్ధములు చేసిరిగాని వారు పరాజితులగుచునే యుండిరి. అనవేమిరెడ్డికి విజయములతోనే కీర్తి యినుమడించెను.

ఈతఁడు తన రాజధాని నద్దంకినుండి తీసివేసి కొండవీడున నభేద్యమగుదుర్గము గట్టించి యందు నెలకొల్పెను. ఈతఁడు

కందుకూరు మొదలుకొని విశాఖపట్టణము జిల్లాలోని సింహాచలమువరకు గల దేశమును బాలించెను. ఇతఁడు పద్మనాయకుల రాజ్యములోనిదగు మిరియాలగూడెము తాలూకాప్రాంతస్థలము కొంత జయించినట్లు గన్పడుచున్నది. మిరియాలగూడెమిపుడు నిజాము సంస్థానములోని నల్లగొండ మండలము నందున్నది. ఈ తాలూకాలోని వాడపల్లి గ్రామములోఁగల నగస్త్యేశ్వరస్వామివారి యాలయముపై ననవేమ భూపాలుని శాసనమొకటి కలదు.

అనవేమ భూపాలుఁడు తన తండ్రి, సోదరులవలెనే పెక్కు ధర్మములొనర్చుచు శిబికర్ణరథీచాముల మరపించెను. ఈతఁ డిమ్మడిలంక యను గ్రామమున కనవేమపురమని పేరు పెట్టి దాని నిమ్మడీంద్రుఁడను నొక రాజనీతి మర్మజ్ఞుఁడగు మంత్రివర్యున కగ్రహారముగా దానము జేసెను. ఈ యగ్రహారమిపుడు తూర్పుగోదావరిజిల్లాలో నమలాపురము తాలూకాలో నున్నది. ఈ మహీపతి వ్రాయించిన తామ్రశాసనములు పెక్కులు గలవు. అందులో వానపల్లి తామ్రశాసన మొకటి. దీనిలోనే పై యగ్రహార విషయము వ్రాయఁబడెను. ఇదిగాక నీతఁడు గోదావరి మండలములోని మన్యమాపురమును, కృష్ణాతీరమునందుగల కొల్లూరు గ్రామమును, బాపట్ల తాలూకాలోని పెదచెఱుకూరు గ్రామమును, బ్రాహ్మణుల కగ్రహారములుగా దానము జేసి శాసనములు వ్రాయించెను.

అనవేమ భూపాలుఁడు ధర్మతత్పరుఁడగుటయే గాక విద్యాభిమానియు, కవులపాలిటి కల్పతరువునై యుండెను. ఈతఁడు 1362–1380 మధ్య రాజ్యమేలెను. ఇతనితరువాత నీతని కుమారుఁడు సింహాసనమునకు వచ్చెను.

---

6. కుమారగిరిరెడ్డి భూపాలుఁడు.

కొండవీటిదుర్గ మన వేమభూపాలుని యనంతరము కుమారగిరి రెడ్డిభూపాలునిచే బాలింపఁబడెను. ఈతఁడు రాజ్యాంగవ్యవహారములపట్ల నెక్కుడు శ్రద్ధదీసికొని పాలించలేదు. ఈప్రభువు వసంతోత్సవములందును, విద్యావ్యాసంగములందును ప్రొద్దుబుచ్చుచుండెను. అందుచే నీతఁడు తండ్రి, తాతలవలె మిక్కిలి ప్రజ్ఞావంతుఁడు గాఁడు.

కర్ణాట సింహాసనాధిపతి యగు రెండవ హరిహరదేవరాయ లాతనికి సమకాలికుఁడు. కర్ణాట యువరాజగు దేవరాయ లుదయగిరి రాజ్యాధిపత్యము వహించి యాతని రాజ్యనుపహరించుటకై సమయము నిరీక్షించుచుండెను. కుమారగిరిరెడ్డి తోఁబుట్టువు మల్లాంబిక భర్తయగు కాటయ వేమారెడ్డి మిక్కిలి సమర్థుఁడు. అందుచే నీతఁడే యీ రాజ్యభారము నంతను వహించెను. ఈతని సామర్థ్యమువలననే కుమారగిరిరెడ్డిరాజ్య మన్యాక్రాంతము గాకుండ నిలచెను. ఈ వేమారెడ్డి

కర్ణాటరాజ్యాధీశులతో మైత్రిగానుండి రాజ్యమునురక్షించుచు వచ్చెను. ఆకాలములోని రెడ్డిరాజులు వసంతోత్సవములు సల్పుచుండిరి. గాని కుమారగిరిరెడ్డి విస్తారముగా జేయుటచే నాతనికి వసంతరాజను బిరుదము గల్గెను. ఈ ప్రభువునకు నానాదేశములనుండి సుగంధ ద్రవ్యము లన్నియు వచ్చుచుండెడివి. ఇవి యన్నియు అవచి తిప్పయసెట్టి యను వైశ్యుని వలన సముద్రములమీద దెప్పింపఁబడుచువచ్చెను. ఈతిప్పయ సెట్టి తమ్ముఁడైన చామిసెట్టి సముద్రప్రయాణము జేసి నానా ద్వీపాంతరములకు బోయి కర్పూరపాదపములు, బంగారు మొలకలు, సంకుమద ద్రవములు, ఆణిముత్యములు, కస్తూరి కాటంకములు, చీనిచీనాంబరములు, గంధసింధురములు, తేజి హాయులు మున్నగువాని నాంధ్రదేశమునకుగొనివచ్చి ప్రభువుల కిచ్చుచుండెను. ఇవి యాతఁడు ముఖ్యముగ పంజాబు, జలనోగి, సింహళము, యాపగ, చోటంగి, చైనా మున్నగు ప్రాంతములనుండి దెచ్చుచు వచ్చెను. ఈ తిప్పయశెట్టి కుమారగిరిరెడ్డి సుగంధభాండాగారమున కధిపతిగా నుండెను.

కాటయ వేముఁడు ధర్మరాజునకు శ్రీకృష్ణునివలె మేనమఱఁదియు, సచివుఁడును, జెలియునై రాజ్యమును రక్షించుచు వచ్చినందున నీతనికి రాజమహేంద్రవరము రాజధానిగా గల తూర్పుదేశమును కుమారగిరిరెడ్డి విడదీసి యుచితముగా నిచ్చెను. దీనివలననే యీతని దుర్బలత్వము నవివేకము విశద

పడుచున్నది. ఇదియే వీనిరాజ్యనాశనమునకు గారణమయ్యెను. కుమారగిరిరెడ్డి విద్యావ్యాసంగమునం దుత్సాహి మాత్రమగుటయేగాక స్వయముగా గ్రంథములు వ్రాయుగల కవీశ్వరుఁడుగా గూడ నుండెను. ఇతఁడు సంస్కృతములో వసంతరాజీయ మను నాట్యశాస్త్రమును రచించెను.

కుమారగిరి రెడ్డిభూపాలుఁడు 1383—1400 మధ్య రాజ్యము జేసెను. ఈతనితో వేమభూపాలుని వంశ మంతరించెను. ఈతని కొక కుమారుఁడున్నట్లు శాసనములవల్ల దెలియుచున్నది. గాని యాతనితరువాత నతఁడు రాజ్యమునకు రాలేదు. ఈతని పెదతాత మనుమఁడగు కోమటివేమారెడ్డి ప్రభుత్వభారమువహించెను.

---

7. పెదకోమటి వేమభూపాలుఁడు.

కొండవీటి రాజ్యములో తూర్పునగల రాజమహేంద్రవర భాగము పోను మిగతదానిని పెదకోమటివేమభూపాలుఁడు కొంతకాలము పాలించెను. కుమారగిరిరెడ్డి తదనంతరమితఁడు ప్రబలుఁడై రాజ్యము నక్రమముగా స్వాధీనపఱచుకొనెను. అందుచే నీతనికిని కాటయవేమారెడ్డికిని విరోధము సంభవించెను. అప్పటినుండియు వీరిద్దఱికి ననేక యుద్ధములుజరిగెను. గాని యెవరుగాని రెండవవారి రాజ్యము నాక్రమింపలేదు.

దేవరకొండ మెతుకుసీమలఁ బాలించుచుండిన పద్మనాయకులు గూడ నీతని రాజ్యమాక్రమింపవలయునని పలుతడవలు దండయాత్రలు జేయుచు వచ్చిరిగాని వారందఱీతని బలపరాక్రమములచే పరాభూతులగుచువచ్చిరి. ఈతఁడట్టి ఘోర సంగ్రామములలో జయించుటచేతనే వీరనారాయణ బిరుదాంకితుఁ డయ్యెను. ఈయనకు మామిడిపెద్దనామాత్యుని మూడవ కుమారుఁడైన సింగనామాత్యుఁడు ముఖ్యమంత్రిగా నుండెను. పెద్దనామాత్యుఁడన వేమభూపాలుని కడ మంత్రిగానుండి ఖ్యాతిఁగాంచెను. ఈ మంత్రిశేఖరుని ప్రజ్ఞావిశేషంబులకు మెచ్చి యాతఁడనేక యగ్రహారములను, ఆందోళికాఛత్రచామర కళ్యాణకలాచికాది బహు సమ్మానార్హ చిహ్నంబుల నాదరముతో గరుణించి యిచ్చెను. ఇతనికి కదనగాండీవి, జగనొబ్బగండడు మున్నగు బిరుదములు గలవు. పెదకోమటివేమభూపాలునికడ వేమనామాత్యుఁడు, పెరిగడనామాత్యుఁడనువారు దండనాయకులుగా నుండిరి. వీరు ప్రధానమంత్రి సోదరులే. ప్రధాన మంత్రియగు సింగనామాత్యుఁడు దైవజ్ఞశిఖామణిగ గూడ నుండెను. ఇతని కొల్వుకూటమెప్పుడును సకలశాస్త్ర పారంగతులైన విద్వాంసులచేత నిండియుండెను. ఇట్టి మంత్రివర్యునిచే బరివేష్టింపఁబడియుండెడి పెదకోమటివేమభూపాలుఁ డెంతటి మహాపండితుఁడో, రసికుఁడో మీరూహింపఁగలరు. ఈ మహీపాలునకు విద్వాంసులందఱు జేరి 'సర్వజ్ఞ చక్రవర్తి,

యను బిరుదు నొసంగిరి. ఈతని చరిత్రమే వీరనారాయణ చరిత్రమనుపేరుతో వామనభట్టు సంస్కృత వచనకావ్యముగా రచించెను.

ఈభూపాలుఁడు సర్వజ్ఞ చక్రవర్తియని పొగడ్తల గాంచుటే గాక నమరుకావ్యమునకు "శృంగార దీపిక" యను వ్యాఖ్యను రచించెను. ఈయన యాస్థానములోనే శ్రీనాథ మహాకవి మొట్టమొదట విద్యాధికారిగా నుండెనని కొందరు విద్వాంసులు చెప్పుచున్నారు.

ఈరాజు ధరణికోట యధిపతి యగు గన్నభూపాలుని కుమార్తె సూరాంబను వివాహమయ్యెను. ఈ సూరాంబయు మిక్కిలి ధర్మతత్పరురాలుగానుండెను. ఈమె సంతానసాగరమను నొకపెద్ద చెఱువును 1410 సం॥లో త్రవ్వించెను. ఈ సంగతి ఫిరంగిపురములోనున్న శాసనములో వ్రాయఁబడియున్నది.

పెదకోమటివేమభూపాలుఁడు గృహరాజు మేడయను నొక గొంటి స్తంభము మేడను గట్టించెననియు, దానిని జూచుటకై కర్ణాధిపతియగు రాయలుగూడ భటులఁబంపి దాని నిర్మాణమున కచ్చెరువు పడెననియు ప్రతీతిగలదు.

ఈ భూపాలుని పరిపాలన మన్నివిధముల బొగడఁదగినదిగా నుండెను. ఈతఁడు నీతని మంత్రులెల్లరును ప్రజ్ఞాశీలురును బాహుబల సంపన్నులునై యున్నందున నీతని రాజ్యమన్యా

క్రాంతము గాలేదు. ఇతఁడు ప్రజలపై క్రొత్త సుంకములను వేయలేదు. ఇతఁడు వర్ణాశ్రమధర్మములు, ఆర్యమతము, వీనిని బోషించెను. బ్రాహ్మణుల కపరిమిత భూదానములిచ్చెను. ఇతఁడు తనదేశమునందు వర్తక మభివృద్ధిపఱచెను. బావులు, చెఱువులు త్రవ్వించి రైతులకు మేలు చేకూర్చెను. ఈతఁడు 1400-1420 మధ్యరాజ్యము జేసెను. ఇతని తరువాత నితని కుమారుఁడు రాచవేమారెడ్డి పట్టాభిషిక్తుఁడయ్యెను.

---

8. కాటయ వేముఁడు.

రాజమహేంద్రపుర రాజ్యమును కుమారగిరి రెడ్డి పాలించిన తరువాత కాటయవేముఁడు పాలించెను. కుమారగిరి రెడ్డి యితనికి బావమఱది యగుటచేతను, రాజ్యపాలనములో నీతఁడు కుమారగిరి రెడ్డికి విశేష సాహాయ్యము జేయుచుండుటచేతను, రాజమహేంద్రపుర రాజ్యభాగము నీతనికిచ్చెను. అప్పటినుండియు నితఁడు స్వతంత్రుఁడై రాజ్యము జేసెను.

ఈతఁడీరాజ్యము గొనినందులకై పెదకోమటి వేమ భూపాలునకు శత్రువయ్యెను. ఒకప్రక్క గజపతికిని వీనికిని గజకచ్ఛపోరుగా నుండెను. వీరిద్దఱితో నీతఁడనేక పర్యాయములు యుద్ధములు చేయవలసి వచ్చెనుగాని వాటినన్నిఁటిలో నితనిని యోడింపలేక పోయిరి. అందుచే నెవరి రాజ్యములలో

వారుండవలసి వచ్చెను. ఇట్లున్నను కాటయవేముని రాజ్యము సింహాచలమువరకును విస్తరించెను. ఇతని యవక్ర పరాక్రమమువల్లనే యీ రాజ్య విస్తారమయ్యెనని చెప్పవచ్చును.

ఈయనకు పోరాటములలో మిక్కిలి సహాయభూతుఁడుగానుండిన దొకరు గలరు. ఈయనపే రల్లాడరెడ్డి. కాటయవేముఁడును, అల్లాడరెడ్డి భార్య వేమాంబ తల్లియును మేనత్త మేనమామ బిడ్డలు. ఈసంబంధ బాంధవ్యముచే నీయల్లాడరెడ్డి కాటయవేమునికి ముఖ్యుఁడయ్యెను. పెదకోమటి వేమ భూపాలుఁడు కొండవీటి రాజ్యము నాక్రమించినందున నాతనిమీఁద యల్లాడరెడ్డికి సరిపడలేదు. అందుచేగూడ నితఁడు కాటయ వేమునితో గలసి పోరుసల్పెను. కాని యీవైరమువల్లనే రెడ్ల ప్రభుత్వాభివృద్ధికి భంగమయ్యెను. రెడ్డిసామ్రాజ్యం మీవిధముగా భిన్నమై జ్ఞాతివైరములతో గూడియుండుట చేతను కర్ణాట, గజపతి, తురుష్క రాజ్యములు గూడ రెడ్లతో విరోధము గలిగియుండుటచేతను పిమ్మట పరాధీనమయ్యెను.

కాటయవేముఁడు సంస్కృతాంధ్రములయందు సమాన పాండిత్యము గల్గినవాఁడు. ఇతని వద్ద రాయని బాచఁడను ప్రసిద్ధికెక్కిన వ్రాయసకాఁడుండెను. కాటయవేమునికి తెలుగుకన్న సంస్కృతము నందెక్కు డభిమానముండెను. ఇతఁడు కాళిదాస రచితములగు మాళవికాగ్ని, మిత్రము, అభిజ్ఞాన

శాకుంతలము, విక్రమోర్వశీయమను నాటకములకు వ్యాఖ్య వ్రాసెను.

కాటయవేముఁడు విద్యాసంపన్నుఁడు మాత్రమేగాక హిందూ మతాభిమానియు, బ్రాహ్మణభక్తి తత్పరుఁడును, దేవాలయ పోషకుఁడునై యుండెను. ఈయన శాసనములు, పాలకొలను, సర్పవరము, ద్రాక్షారామము, చాళుక్య భీమవరము, సింహాచలములలోని దేవాలయములలో నున్నవి.

కాటయవేముని భార్య రాజమహేంద్రవరములో మార్కండేయేశ్వరాలయము గట్టించెను. మరియు కోనసీమలోని మల్లవరమను గ్రామమును నృసింహుఁడను నొక పండితునకు ధారాగ్రహితము జేసెను. కాటయవేముఁడు కొండవీటి రెడ్డిరాజులు వహించిన బిరుదములన్నియు వహించెను. ఇతఁడు బ్రతికియున్నంత కాలము శత్రువులకజేయుఁడై యుండెను.

కాటయవేమునకు మల్లాంబయను భార్యయందుజనించిన కాటప్రభువను కుమారుఁడు గలఁడు. దొడ్డాంబిక యను నామెగూడ కాటయవేముని రెండవ భార్య యనియు నీమెకు గూడ కుమారగిరి యను పుత్రుఁడు గలడనియు నొకానొక శాసనమువలన దెలియవచ్చుచున్నది. కాని యీయిద్దరు కుమాళ్ళలో నెవ్వరుగాని యీయన యనంతరము రాజమహేంద్రపుర రాజ్యము పాలించలేదు. కాటయ వేముఁడు 1386-1416 ల మధ్యకాలములో రాజ్యము బాలించెను. ఇతని తరువాత సల్లాడ రెడ్డి రాజ్యపాలనము జేసెను.

---

9. వీరభద్రనృపతి.

రాజమహేంద్రపురరాజ్య మల్లాడభూపతి యనంతర మాతని జ్యేష్ఠకుమారుఁడగు వేమారెడ్డి వలన పాలింపవలసి యున్నను, కాటయవేముని కుమారుఁడగు కుమారగిరి దీనికి హక్కుదారు కావలసియుండినందునను, ఆతనికి తన తమ్ముఁడు వీరభద్రారెడ్డి బావమఱఁది యగుటవల్లను, పరస్పర వైరములు లేకుండుటకై వేమారెడ్డి తన తమ్ముఁడగు వీరభద్రారెడ్డికే పట్టముగట్టి తాను సహాయుఁడుగా బరిపాలించెను. అందుచే నీ రాజకుటుంబము కలహములకు తావు లేకుండ నన్యోన్యానురాగముతోడను, నైకమత్యముతోడను వ్యవహరించెను.

వీరభద్రభూపాలునకు యవన, కర్ణాట, కటక, యొడ్డె రాజులు లోబడియుండిరి. ఈయన రాజ్యము చిల్కసముద్రము వరకును వ్యాపించెను.

వీరభద్రభూపాలుని తమ్ములగు దొడ్డయయు, నన్నారెడ్డియు నాతని సేనాధిపతులుగానుండి యన్నలకు తోడ్పడుచుండిరి. ఇందులో దొడ్డభూపతి గజ్జపుస్వారియందసమానమైన ప్రఖ్యాతిగాంచెను. ఇతఁడు తన యశ్వము నిరువది నాలుగుమూరల దూరమును దాటించెడివాఁడు. ఈతని పరా

క్రమ సంపత్తివలననే వీరభద్రనృపతి చిల్కసముద్రమువఱకు గల దేశమును జయించి జయస్తంభములు నాటించెను.

అల్లాడభూపతు లందఱును శైవమతస్థులు. వీరికి కుల గురువు ఘోడెరాయభీమేశ్వరుఁడు. ఈయన శైవబ్రాహ్మణుఁడు. వీరభద్రనృపాలుని కాలములో నాతని రాజ్యమునగల బ్రాహ్మణులు మహదైశ్వర్యసంపన్నులుగా నుండిరి.

వీరభద్రభూపాలునికి బెండపూడి అన్నామాత్యుఁడను నతఁడు మంత్రిగా నుండెను. ఇతఁ డల్లాడభూపతి మంత్రియగు లింగనామాత్యుని రెండవ తమ్ముఁడు. ఇతఁడుగూడఁ దన సోదరునివలెనే యెక్కుడు ప్రజ్ఞావిశేషములు గలవాఁడు. ఈతఁడు చాలా భాషలనునేర్చి వివిధదేశములనుండి వచ్చిన రాయభారులతో రాజాస్థానమున బ్రసంగించుచు వారలవద్దనుండి యుత్తరప్రత్యుత్తరములు జరపుచువచ్చెను. ఇతఁడు పారసి భాష చక్కఁగ వ్రాయునట్టి వ్రాయసకాఁడు. బహుమనీ సుల్తానగు నహమ్మదుఖానుతో నీతఁ డుత్తరప్రత్యుత్తరములు స్వయముగా జరుపుచుండెడివాఁడు. ఈమంత్రిపుంగవుఁడు సంగమేశ్వరములోని శంభులింగమునకు కళ్యాణగర్భగృహము దక్షవాటికలోని యిందుమౌళికి మొగలివాకిలియు, మున్నగు ప్రతిష్టాపనలెన్నియో చేయించెను.

వీరభద్రానృపాలుఁ డన్నయగు వేమభూపాలుని సహాయముతో కళింగదేశములోని యొడ్డాది, నాకవరము, లోతుగడ్డ, నందాపురము, సింహాద్రి, చీకటి, చిల్కసముద్రము మున్నగు ప్రదేశములేగాక సప్తగూడెములు, ఝాడేశవనము, బారుహదోంతి, జంతరునాడు మొదలగు కొండదేశములను గూడ జయించి దండకారణ్య (బస్తరుప్రాంతము) మధ్యమందున్న పుళిందరాజ రంభాహివంశజుల కభయ మొసగెను. అప్పటికి కటకాధిపతియు, కళింగ గాంగవంశజుఁడును, గజపతియు నగు భానుదేవుని నోడించి తన రాజ్యమును మహానది వరకును విస్తరించెను. అనగా నితఁడు కళింగదేశమంతయు నాక్రమించి పరిపాలించెను. ఈయన రాజ్య విస్తీర్ణము రమారమి ముప్పది వేల మైళ్లుండవచ్చును.

వీరభద్రానృపాలుని యాస్థానములో శ్రీనాథమహాకవియు, కొమ్మనామాత్యకవియు నుండిరి. శ్రీనాథమహాకవి కాశీకాఖండమును దెనుగించి వీరభద్రభూపతి కంకితమిచ్చెను. కొమ్మనామాత్యుఁడు శివలీలావిలాసమను గ్రంథమును రచించి దానిని వీరభద్రారెడ్డి తమ్ముఁడగు దొడ్డయకు కృతి నొసంగెను. వీరభద్రనృపాలుఁ డనేక భూదానములుజేసి కంచి, శ్రీగిరి, కాశి, పంచారామము మున్నగు స్థలములలోని దేవాలయములలో శాసనములు వ్రాయించెను. ఈభూదానములు అగ్రహారములు, మాన్యములు విశేషముగా బ్రాహ్మణుల

కియ్యఁబడుచుండెను. దీనికి కారణ మేమనగా నాకాలములో విద్యలన్నియు వారి యధీనమైయుండెను. అందుచే విద్యాభివృద్ధిజేయుట యన్న బ్రాహ్మణులఁ బోషించి వారిని బ్రోత్సహించుటగా నుండెను. వీరభద్రనృపాలుని పట్టమహిషియగు అనితల్లీ దేవి కలువచేరను గ్రామము నాయుర్వేదపారంగతుఁడగు పరహితాచార్యుఁడను వానికి దానము జేసెను. దీనికే యన్నవరమని పేరు పెట్టబడెను. ఈ గ్రామమిప్పుడు రామచంద్రపురము తాలూకాలో కలువచెర్ల యను పేరిటనున్నది.

వీరభద్రనృపాలుఁడు సమర్థుఁడగు తన సోదరుని సహాయముతోడను, విశేషప్రతిభాశాలియగు మంత్రివర్యుని నిపుణతతోడను, పరాక్రమవంతులైన సేనాధిపతులతోడను, శ్రీనాథ మహాకవివంటి యాస్థాన విద్వత్పండితాశీర్వాదముతోడను సామ్రాజ్యవిచ్ఛిన్నముగానేల దాని నన్నివిధముల నభివృద్ధికిఁ దేగలిగినను, మహ్వాంధ్రదేశమందప్పుడు గలిగిన విప్లవముచే నారాజ్యము స్థిరముగా నిల్చినది కాదు. వీరభద్రభూపతి 1445 వరకు రాజ్యమేలుచుండగా నిదిగజపతిరాజ్యమునకుఁ బ్రక్కలో బల్లెముగా నుండెను. ఈ రెడ్డిరాజ్యాభివృద్ధియున్నంత వరకు గజపతిరాజ్యమభివృద్ధిగాకుండెను. వీరికి కర్ణాటకులు గూడశత్రువులుగనేయుండిరి. కానికర్ణాటాధిపతులు రెడ్లమైత్రి నప్పుడప్పుడు సల్పుచు వచ్చిరి. పశ్చిమమున బహామనీరాజ్యము నానాటికి వృద్ధియై 1435 సంవత్సరములో

వల్లాఉద్దీన్‌షాహ రాజ్యాధిపతియయ్యెను. ఇతఁడు కర్ణాటక సామ్రాజ్యచక్రవర్తి యగు ప్రౌఢదేవరాయనితో యుద్ధములు ప్రారంభించెను. అప్పుడు ప్రౌఢదేవరాయలొకప్రక్క గజపతులతో గూడ సంగ్రామ మొనర్పవలసివచ్చెను. అందుచే యవనకర్ణాటకటక భూమీశ్వరులందు వారలలో వారు ఘోరముగాఁ బోరాడుచు వచ్చిరి. వీరందరును సమానబలులేగావున వీరియుద్ధముల నడుమ వీరభద్రారెడ్డి రాజ్యము నిలువజాలకపోయెను.

గజపతులిదే సమయమున రెడ్డిరాజ్యమును మ్రింగివేయుటకు చలము పట్టిరి. ఇంతలో 1435 సంవత్సరములో గజపతుల రాజధానియగు కటకపురమున విప్లవముజరిగి రాజగు భానుదేవుఁడు సంహరింపఁబడెను. అందుచే నాతనిమంత్రియగు కపిలేంద్ర గజపతి రాజ్యాధిపతియయ్యెను. ఇతఁడు మిక్కిలి విక్రమశాలి. అందుచే నితఁడు తన రాజ్యాభివృద్ధికి రెడ్డిరాజ్యము భంగముగ నున్నదని ముందు దానినే నిర్మూలింపవలయునని నిశ్చయించెను. అట్లు నిశ్చయించుకొని యాతఁడు పదిసంత్సరములు కృషిఁజేసెను. ఈతఁడు 1444 వత్సరములో రాజమహేంద్రపురము పైకి దండయాత్ర వెడలి వచ్చెను. అప్పుడు వీరభద్రనృపాలునకు ప్రౌఢదేవరాయలు సహాయముగా వచ్చెను. ఉభయపక్షముల వారికి తీవ్రమైన యుద్ధము జరిగెను. ఆతడవమాత్రము గజపత జయించలేక మరలి పోవలసివచ్చెను.

తరువాత రెండు సంవత్సరములకు విద్యానగరమున దేవరాయలు చనిపోయెను. మహాసమర్థుఁడగు నీశత్రువు మరణించినందున కపిలేంద్రగజపతి మున్ముందు కర్ణాటకరాజ్యము నాక్రమించుకొని పిమ్మట తురుష్కులను జయించి దక్షిణ హిందూదేశమున నేకసామ్రాజ్యము నెలకొల్పుటకు ప్రయత్నము జేయుచుండెను.

ఇట్లుండగా నన్నదేవచోడుడను క్షత్రియుఁడు బహుమనీ సుల్తానగు నల్లాఉద్దీన్‌షాహావద్దఁజేరి యాతని సహాయముతో గొంత సైన్యమునుదీసుకొని వీరభద్రనృపాలుని రాజమహేంద్రపుర రాజ్యములో కొంత భాగము నాక్రమించెను. అప్పుడే తూర్పు భాగమున గజపతులతో పోరారంభింపఁబడెను. కాలముకర్మము సమకూడెనన్నట్లుగానిదివిని దక్షిణమునుండి లింగమనాయఁడు పింగమనాయఁడు మున్నగు పద్మనాయకులు కర్ణాటభూపాలురకు సామంతులైనందున వారిసేనలతో దండెత్తివచ్చిరి. అందుచే రాజమహేంద్రపురరాజ్యమట్లు యవన, కర్ణాటక సైన్యములతో నొక్కమారు పోరాడవలసివచ్చెను. ఈ ఘోరమైన యుద్ధములోనే వీరభద్ర నృపాలుని సైన్యమంతయు హతమయ్యెను. తుదకు వీరభద్రనృపాలుఁడు నితని యన్న వేమారెడ్డియు వీరస్వర్గమును జూరఁగొనిరి.

వీరభద్రనృపాలుని పరిపాలనము మొత్తముమీద జనరంజకముగనే 1426 సం॥ మొదలు 1450 వరకు జరిగినదిగాని పైవిప్లవములవల్ల నంతటితో రెడ్డిరాజ్యము రాజమహేంద్రపురమున నస్తమించెను.

---

10. ప్రథమ హరిహరరాయలు.

తుంగభద్రా నదీతీరమున యానెగొందియను పురము గలదు. దానికి నెదురుగా నదికి దక్షిణముగా విద్యానగరమను పట్టణము గలదు. ఇది కర్ణాట సామ్రాజ్యమునకు రాజధానిగా నుండెను. అంతకుపూర్వము రాజధాని యానెగొందిగా నుండెను. విద్యానగరము విద్యారణ్యులవారి ప్రోత్సాహముచే గట్టబడినది. నూతన కర్ణాటసామ్రాజ్యమును విద్యానగరము రాజధానిగా పాలించినవారిలో మొదటివాఁడు ప్రథమ హరిహరరాయలు. ఈరాజ్యము చాల పెద్దది.

ఇతఁడు యదువంశమున జనించినసంగమరాజపుత్రుఁడు. వీరైదుగురన్నదమ్ములు. హరియన్న, కంపన్న, బుక్కన్న, మారన్న, ముద్దన్న యనువారు. ఈయనయు నీతని తమ్ములలో నొక్కఁడగు బుక్కరాయలు నాంధ్రచక్రవర్తియగు రెండవ ప్రతాపరుద్రుని కడ మొదట కోశాధ్యక్షులుగా నుండి యా సామ్రాజ్య విచ్ఛిన్నమైన వెనుక నానెగొందికి వచ్చి యాపురాధీశ్వరుఁడగు జంబుకేశ్వరరాయలవద్ద మంత్రి కోశాధిపతులుగా నుండిరనియు, ఢిల్లీ చక్రవర్తికి జంబుకేశ్వరరాయలకు జరిగినయుద్ధములో జంబుకేశ్వరరాయలు మరణించె ననియు, నప్పుడు ఢిల్లీశ్వరుఁడు హరిహరరాయలకుఁ బట్టము గట్టె ననియు నొక చరిత్ర తెలుపుచున్నది. హరిహరరాయలు

మొదట నానెగొందిలో నుండి రాజ్యమేలుచుండఁగా నొకనాఁడరణ్యములోని కనగా తుంగభద్రానది కావలి ప్రదేశములోనికి వేటకేగెను. అప్పుడచ్చట కుందేలొకటి వేట కుక్కపైఁబడి కరువవచ్చెను. దాని కాశ్చర్యపడి తిరిగివచ్చిన పిదప నీసంగతి విద్యారణ్యుల వారను స్వాములవారికిఁ జెప్పఁగా వారది యొక దివ్యస్థలమనియు, నిచ్చట పురనిర్మాణముఁ జేసినయెడల రాజ్య మన్నివిధముల నభివృద్ధిఁ జెందుననియు బలికెను. అందుచే హరిహరరాయ లాయరణ్యమును భేదించి విద్యానగరమను నూతన రాజధానిని గట్టించి యందులోఁ ప్రవేశించి రాజ్యమేలెను.

హరిహరరాయలు కర్ణాటరాజ్యములోని కొంతభాగమును, నాంధ్రరాజ్యములోని కొంతభాగమును బాలించెను. ఇతని కాలములో రాజ్యము నలుప్రక్కల విస్తరించెను. కర్ణాటరాజ్యము నాకాలములో హొయిసలరాజ్యమని పిలువఁబడుచుండెను. దానిని మూడవ బల్లాలదేవుఁడు పాలించుచుండెను. ఈ బల్లాలదేవునిపైకి మహమ్మదు తుఘ్లఖ్ అను మహమ్మదీయుఁడు 1327 సంవత్సరములో దండెత్తివచ్చి యాతని రాజధానియగు ద్వారసముద్రమును నాశనము జేసెను. అప్పటినుండి యీతఁడు తన రాజధానిని దక్షిణార్కాడు జిల్లాలోని తిరువణ్ణామలకుమార్చుకొనెను. తరువాత నీతని రాజ్యము క్రమముగా హరిహరరాయలు జయించి తీసుకొనెను. హరి

హరరాయలు తన మొదటి తమ్ముఁడగు బుక్కరాయలను యువరాజును జేసెను. తక్కినతమ్ములందరు నీతనికి విధేయులై సేనాధిపతులుగా నుండిరి. సోదరులందరు నీవిధముగా కలిసి యుండుటచే వీరు మహమ్మదీయుల రాజ్యములోగూడ కొంత నాక్రమింపగల్గిరి. హరిహరరాయ లుదయగిరి, చంద్రగిరి, పెనుగొండ రాజ్యములను జయించెను. ఈతఁడు 1344 సంవత్సరములో ప్రతాపరుద్రుని పుత్రునితో దురుష్కులు పోరు సల్పుచుండఁగా ప్రతాపరుద్రునికుమారునికి సహాయముకొరకై తన సేనలను, తన తమ్ముఁడగు కండభూపతిని బంపెను. అప్పుడు మహమ్మదీయు లేకశిలానగరమునుండి తఱిమివేయబడిరి.

తరువాత కంపభూపతినుదయగిరి రాజ్యమునకు బాలకునిగా నియమించెను. దీనిలోనే పాకనాడు, ములికినాడును జేరి యుండెను. హరిహరరాయలకును బహమనీరాజ్యాధిపతియగు నల్లాఉద్దీన్ షాహాకును యుద్ధములు జరగుచువచ్చెను. గాని వాటిలో చాలవరకు హరిహరరాయలే జయముబొందుచు వచ్చెను. అందుచే నీతని రాజ్యము మహమ్మదీయుల కభేద్యమై యాంధ్రకర్ణాటకుల కెల్లరికి రక్షకస్థానమయ్యెను.

పైనచెప్పఁబడినదుర్గములేగాక హరిహరరాయలు మహిశూరము, కన్నడము, వనవాసి సీమలను జయించి రాజ్యము విస్తరింపజేసెను. ఇతఁడు బాదామికోటను బలపరచెను.

ఇతఁడు విద్యానగరమునను, కంపభూపతి యుదయగిరియందును, వీరబుక్కభూపతి మధ్యదేశమునను, మారభూపతి వనవాసి దేశమునను పాలించుచుండిరి. హరిహరదేవరాయలు మహారాజపదవియందున్నను, మూడవ బల్లాలదేవుఁడు జీవించియున్నంతవరకు తాను మహామండలేశ్వరుఁడనని మాత్రమే చెప్పుకొనుచు దేశమును శాంతియుతముగా బాలించెను. ఇతఁడు కన్నడదేశములోని ప్రాచీనజైనుప్రభువులను లోబరచుకొని యాదేశపు పన్నులు రాబట్టుకొనుటకై చక్కని పద్ధతుల నేర్పాటుజేసెను. కన్నడదేశములోని సముద్రప్రాంతమందున్న యరబ్బులనుగూడ జయించి వారిచే గప్పములందుచు వచ్చెను.

హరిహరరాయల రాజ్యములో జనుల మానప్రాణధనంబులకు మంచి రక్షణముండెను. వాణిజ్యము పెంపొందెను. దారిదోపిడులు దొంగతనములు తగ్గిపోయినవి. పంటలు బాగుగా బండుచు దేశము సుభిక్షముగా నుండెను.

హరిహరరాయలు ప్రతాపశీలుఁడై రాజ్యము లాక్రమించుటయేగాక దానధర్మములందును మిక్కిలి ప్రసిద్ధివహించెను. ఈయనయు నీతని తమ్ములును కలసి శృంగేరిపీఠాధిపతి జగద్గురు భారతీతీర్థ శ్రీపాదులకును వారి శిష్యులకు కలిసి తొమ్మిది గ్రామములను దానముచేసిరి. ఈ దానము వారి దిగ్విజయ జ్ఞాపకార్థము చేయబడినది. మఱియు నీయన పట్టాభి

షేకకాలములో చంద్రగిరిరాజ్యములోని పడనాటిసీమలో గల కాపలూరను గ్రామమునకు హరిహరపురమని నామకరణము జేసి దాని ననంతసూరనార్యుండను బ్రాహ్మణున కగ్రహారముగా నిచ్చెను. ఇతని తమ్ముడు బుక్కరాయలు పినాకినీ తటమున గల పంచాతెలదిన్నె యను గ్రామమునకు బుక్కరాయపుర మని పేరుబెట్టి నాచనసోముఁడను కవీంద్రున కగ్రహారముగా నొసఁగెను. ఈ నాచనసోముఁడుత్తర హరివంశమను కావ్యమును రచించి దానిని హరిహరరాయల కంకిత మిచ్చెను.

హరిహరరాయలు 1336 సం॥ మొదలుకొని 1355 సం॥ వరకు రాజ్యమేలెను. ఇతని తరువాత నితనితమ్ముఁడగు వీరబుక్కరాయలు పట్టాభిషిక్తుఁడయ్యెను.

11. వీర బుక్కరాయలు.

విజయనగర సామ్రాజ్యమును ప్రథమ హరిహరరాయల మరణానంతరము వీరబుక్కరాయలు పాలించెను. ఈతని కగ్రజుఁడగు కంపభూపతిగూడ యప్పటికే గతించినందున రాజ్యమీతని వశమయ్యెను.

బుక్కరాయలకు దేవాయి యను భార్య గలదు. ఆమెవలన నాతనికి ముగ్గురు కుమారులు జనించిరి. అందులో

కంపభూపాలుఁ డగ్రజుఁడు. ఇతఁడు బుక్కరాయని సేనాధిపతిగా నుండెను. బుక్కరాయల యాజ్ఞానుసార మీతఁడు దక్షిణదేశ దిగ్విజయయాత్రకై బయలుదేరెను. ఈతని తోడుగా గోపన్న మంత్రియును, సాళువమంగరాజను సేనాధిపతియు బంపఁబడిరి. అట్లు బయలుదేరి కంపభూపతి ముందుగ ద్రావిడదేశము పాలించుచున్న రాజనారాయణ సాంబువరాయల మీఁదికి దండెత్తిపోయెను. సాంపరాయలకును వీరికిని పాలేఱను నదియొద్ద ఘోరమైన యుద్ధము జరిగి తుదకు సాంపరాయలు తన ద్రావిడ సైన్యములతో రాజగంభీర పర్వతము వద్దకుఁ బాఱిపోయెను. అంతట విజయనగర సైన్యము లాదుర్గమును ముట్టడింపఁగా నప్పుడుగూడ మరల సంగ్రామమయ్యెను. ఈ సంగ్రామములో గూడ సాంపరాయలు జయించలేక కంపభూపతికి లోఁబడెను. ఇట్లు కంపభూపతి సాంపరాయలను జయించి తరువాత కాంచీపుర రాజధానిని వశము జేసికొనెను.

తరువాత కంపభూపతి మరకతనగరము రాజధానిగా నేర్పాటుచేసుకొని కొంతకాల మచ్చటనుండి తరువాత మధురానగరముపైకి దండయాత్ర బయలుదేరెను. ఈ త్రోవలో శ్రీరంగముననున్న తురుష్కనాయకుని జయించి యచ్చట రంగనాథుని విగ్రహ మాతఁడదివరలో దీసివేయింపఁగా కంపభూపతి దానిని పునఃప్రతిష్ఠఁ గావించెను. తరువాత మధుర

సుల్తానును జయించి దేశమునంతను స్వాధీనము జేసుకొనెను. కంపభూపతి తనకు తోడుగానున్న సాళ్వమంగరాజను మహాపరాక్రమవంతుఁడైన సేనాని సహాయముతోడనే దక్షిణదేశ మంతయు నిట్లు జయింపఁగల్గెను. ఈతఁడు జయించినదాని కంతటికి రాజగంభీర రాజ్యమని పేరుబెట్టఁబడి కంపభూపతియే పాలించుచువచ్చెను.

బుక్కరాయల పాలనలో రాజ్యమూడు ఖండములుగా నుండెను. ములికినాడు పాకనాడును జేరిన యుదయగిరిరాజ్యము మొదట బుక్కరాయల సోదరుఁడగు కంపభూపతి పాలనములోనుండి యాతని మరణానంతర మతని జ్యేష్ఠపుత్రుఁడైన సంగమరాజు విక్రమసింహపురములోను, రెండవకుమారుఁడగు శావన్నయొడయ ఉదయగిరిలోనుండి పాలించుచుండిరి. ఈ సంగమరాజు నెల్లూరుజిల్లాలోని బిట్రగుంట యను గ్రామమును 1357 సం॥లో బ్రాహ్మణులకు దానము జేసెను.

రెండవఖండము పెనుగొండ రాజ్యము. దీనిలో గుత్తి, చంద్రగిరి రాజ్యములు చేరియుండెను.

మూడవఖండము ఆరగమలెవా రాజ్యము. దీనిలో వనవాసి, చంద్రగుత్తి, గోవాయను రాజ్యములుండెను. మైసూరు మండలమునగల షిమొగజిల్లాయును, ఉత్తరకన్నడ జిల్లాయును కలసి యీ రాజ్యముగా నేర్పడెను. దీనిని బుక్కరాయల

తమ్ముఁడగు మారభూపతి పాలించుచుండెను. వనవాసి రాజ్యము నీతఁడే జయించి తన రాజ్యములోఁ జేర్చుకొనెను.

నాల్గవ ఖండము ములువాయి రాజ్యము. దీనిలో తేలికనాడు మున్నగునవి కలవు. దీనిని బుక్కరాయల సోదరుఁడగు ముద్దభూపతి పాలించుచుండెను.

ఐదవది తుళురాజ్యము. దీనిలో బరకూరు, మంగళూరు రాజ్యములున్నవి. ఇవి మొదట బల్లాలదేవుని సామంతుఁడగు శంకరప్పయనువాని పాలనలో నుండగా వీరబుక్కరాయలు వానిని జయించి తన రాజ్యములో గలుపుకొనెను. హడపాద గౌతరాజను మంత్రిని దీనికి పాలకునిగా బుక్కరాయలు నియమించెను. ఈ రాజ్యపాలకులకా కాలములో స్వంత నాణెములు ముద్రించుకొను నధికారము గలదు. అందువలననే మంగళూరు గద్యాణములు, బరకూరు గద్యాణములు అను నాణెముల పేరులు వినవచ్చుచున్నవి.

ఆరవది రాజగంభీర రాజ్యము. కంప భూపాలునిచే జయింపఁబడి పైన చెప్పఁబడినది.

ఈయారు ఖండములమీఁదను పరిపాలన మొత్తము బుక్కరాయలు చూచుచుండెను. ఇతఁడు విద్యానగరమందే నివసించువాఁడు. బుక్కరాయలవద్ద మాధవ విద్యారణ్యులను పేరుగల మంత్రిసత్తముఁడు గలఁడు. ఇతఁడు జయంతిపురాధిపతిగ నుండెను. గోవా రాజ్యము తురుష్కులవశమైయుండఁగా

దాని నీతఁడు జయించెను. ఈతఁడు రాజానుమతమున పెక్కు భూదానములను చేసెను. నాగరఖండములోని మచ్చుండి యను గ్రామమును కాశ్మీర బ్రాహ్మణులకు దానమిచ్చెను. ఈమంత్రిపుంగవునకు వీరవసంతమాధవుఁడను నామాంతరము గలదు. ఇతఁడు రాజనీతిపారంగతుఁడగుటయేగాక వేదవేదాంతార్థముల నెఱింగిన పండితుఁడుగూడనై యుండెను. ఇతఁడు సూతసంహితకు వ్యాఖ్యానమును, శైవామ్నాయసారము, మాధవ నిదానము మున్నగు పెక్కు గ్రంథములు రచించెను. ఇతఁడు గోవాలోని తురుష్కులను జయించినందులకై బుక్కభూపతి భువనైకవీరుఁడను బిరుదు నిచ్చెను.

వీరబుక్కరాయలు విజయనగర సామ్రాజ్యమును పాలించుచు విద్యానగరమున రత్నసింహాసనమున హాయిగా గూర్చుండెనని తలంపరాదు. బహుమనీసుల్తానగు మహమ్మదుషాహ ఓరుగల్లు, గోలుకొండ రాజ్యములను జయించిన తరువాత యీ రాజ్యవైభవమును జూడలేక దీని నెప్పుడు మ్రింగుదునాయని వేచియుండెను. రాత్రింబవళ్లాతనికి నిద్ర లేదు. ఈ సుల్తాను తుదకు 1356 సం॥ లో సైన్యములను గూర్చుకొని వీరబుక్కరాయలపైకి దండెత్తి వచ్చెను. గాని యీ యుద్ధములో నిరువాగులవారికిని విశేష సైన్యనష్టమే గాని లాభము గలుగలేదు. అందుచే మహమ్మదుషాహ తిరిగి వెనుకకు పోవలసినవాఁడయ్యెను.

మహమ్మదుషాహ 1375 సం॥లో మరణించెను. ఆతని కుమారుఁడగు ముజాహిద్ షాహ బహమనీ రాజ్య సుల్తానయ్యెను. ఇతఁడు సింహాసన మెక్కినంతనే బుక్కరాయలపైకి దండెత్తి వచ్చెను. అప్పుడు యుద్ధము మూఁడు సంవత్సరములు జరిగెనని కొందరు చరిత్రకారులు వ్రాసిరి. ఇందులోఁగూడ సుల్తానునకు విజయము కలుగలేదు. ఇతఁడు తన సైన్యముఁ బోగొట్టుకొని మరలి పాఱిపోవలసి వచ్చెను.

వీరబుక్కరాయలు సామాన్యరాజు గాఁడు. సర్వస్వతంత్రుఁడు. చాలదేశములను జయించినవాఁడు. తన యన్నయగు హరిహరరాయల కాలమునుండిగూడ సామ్రాజ్యాభివృద్ధికై చాల కృషిసల్పి రాజ్యము విస్తరింపఁజేయుటయేగాక యార్థిక సంపత్తియందుగూడ ముందునకు దీసికొనివచ్చెను. మలయాళము, సింహళము మొదలగు రాజులుగూడ నాతనికి కానుకలు బంపుచుండిరి. గోవా యను నౌకాస్థాన మీతని రాజ్యములోనే యుండెను. ఇతఁడు మిక్కిలి ప్రజారంజకుఁడుగ నుండెను. ఈయన యనేకమైన చెఱువులు, బావులు, కాలువలు త్రవ్వించి ప్రజలకు సౌఖ్యములు కలిగించెను. ఈయన భూమిశిస్తును గుఱించి నియమము లేర్పఱచెను. విద్యానగర మీతఁడింకను వృద్ధిజేసెను. ఈపట్టణములో పెద్ద పెద్ద గిడ్డంగులు, భవ్యమందిరము లేర్పడెను. ఇది దక్షిణ హిందూదేశమున కంతటికి ప్రధానస్థలమయ్యెను. అందుచే వర్తకు లచ్చటనే తమ శాలల నెలకొల్పి కాపురముండుచు వచ్చిరి.

వీర బుక్కరాయలు నితని యన్న హరిహరరాయలు గూడ శైవమతస్థులు. ఐనను వీరు వైదిక మతమునందు గూడ నభిమానముఁ జూపుచునే వచ్చిరి. పరమత ద్వేషము వీరెఱుఁగనే యెఱుఁగరు. అది మహమ్మదీయులలో బుట్టి పెరిగెను. ఈయన పాలనలో శ్రావణ బెల్గోలాయను నగరములో జైనులకు వైష్ణవులకు నొకప్పుడు వివాదములు చెలరేగెను. అందులో బుక్కభూపతి మధ్యవర్తిగా నుండి తగవు దీర్చి యిరుకక్షులవారిని సంతోషపెట్టెను. ఈయన సాయన మాధవులను వానిచే వేదభాష్యమును వ్రాయించెను.

బుక్కభూపతిగూడ విద్యాభిమానియు, బ్రాహ్మణభక్తితత్పరుఁడునై యుండెను. అనేకములగు వీరి దానధర్మములు కాలగర్భములోఁబడి మనకుఁదెలియకుండ నున్నవికాని యివి సామాన్యములుకావు. ఈయన పరిపాలించినంత దేశమీతని పూర్వులు పాలించలేదు. ఈతఁడు 1355-1377 వరకు రాజ్యమేలెను.

బుక్కరాయలకు గౌరాంబికయను భార్యగూడ యుండెను. ఈమెవలననీతనికి హరిహర రాయలను కుమారుఁడు గల్గెను. ఈతఁడే తనతండ్రి యనంతరము రాజ్యమునకు వచ్చెను.

12. రెండవ హరి హర రాయలు.

విద్యానగరమున వీరబుక్క భూపాలుని మరణానంతర మతని కుమారుఁడగు రెండవ హరి హర రాయలు పట్టాభిషిక్తుఁడయ్యెను. ఈతఁడు దాక్షిణాత్య ప్రభువు లెల్లర నోడించి సామ్రాజ్య విస్తీర్ణము వృద్ధిజేసెను. ఇతఁడు తన పూర్వులవలె మహామండలేశ్వర, ఒడయర్ అను బిరుదులతో తృప్తి వహింపక తనకు లోబడిన మాండలిక రాజులనేకమంది వద్ద కప్పములు పుచ్చుకొనుచు మహారాజాధిరాజ, రాజపరమేశ్వర యను బిరుదుల వహించి చక్రవర్తియయ్యెను.

ఇతనివద్ద మంత్రులు సేనాధిపతులు మిక్కిలి ప్రఖ్యాతి జెందిన వారుండిరి. సాయనాచార్యులు, మాధవమంత్రి, ముద్దప దండనాథుఁడు, గుండప దండనాథుఁడు అను వారీయన మంత్రులు. వీరిసహాయము వలననే మహమ్మదీయులయొత్తిడికి హరి హర రాయలు నిలువఁగల్గెను. ఇందులో గుండప్ప దండనాథుఁడు కొండవీడు, ఓరుగల్లు రాజ్యములను హరించుటకై రెడ్డివారితోను, పద్మనాయకులతోను పోరాడి చూచెను. గాని యాతని ప్రయత్నములు సాగలేదు. ఇతఁడు గోవా నగరములోఁజేరిన మహమ్మదీయులను తఱిమివేసెను.

రెండవ హరి హర రాయలు పరాక్రమవంతుఁడేగాక సంగీత సాహిత్యములయందు గూడ ప్రవీణుఁడును దేవబ్రా

హ్మణ భక్తిగలవాఁడునై యుండెను. ప్రజలసుఖమును ముఖ్యముగా గమనించినవాఁడు. ఇతఁడు తనపాలనలో మతాంతరులైన జైనులనుగూడ నున్నత పదవులందుంచి యాదరించెను. ఇరుగప్ప దండాధిపుఁడను జైన పండితుఁడందు చేతనే విద్యానగరమున జైనాలయ మొకటి నిర్మించెను. ఇతఁడు సేనాధిపతులలో నొక్కఁడుగానుండెను.

హరిహరరాయలు దేవాలయములకు, పాఠశాలలకు మాన్యముల నొసంగెను. ఈయన కాలముననే విద్యారణ్య భాష్యరచనము ముగింపఁబడెను. హరిహరరాయలకు మల్లాంబికయను భార్యవలన దేవరాయలను కుమారుఁడు జనించెను. ఇతనిని యువరాజును జేసి యుదయగిరి రాజ్యమునకు పాలకునిగా నియమించెను.

హరిహరరాయలు తన కుమార్తె హరిహరాంబయను నామెను కొండవీటిరెడ్డి రాజగు కాటయవేమారెడ్డి కుమారుఁడు కాటయ ప్రభునికిచ్చి వివాహము జేసెను.

హరిహరరాయల రత్నభండారమునకు వినుకొండతిప్పనామాత్యుఁడనువాఁడు రక్షకుఁడుగా నుండెను.

హరిహరరాయలకును బహమనీసుల్తానునకు నొకసారి యుద్ధము జరిగెను. అప్పుడు ఫిరోజిషాహ యనువాఁడు సుల్తానుగా వచ్చెను. కృష్ణానది కిరుప్రక్కల

నుభయసైన్యములు విడిసియుండెను. అప్పుడు రాయలసైన్యములే యధికముగానుండెను. దానినిజూచి సుల్తాను రాత్రివేళ నది దాటివచ్చి మోసముచే రాయలను జయింపజూచెనుగాని సాధ్యపడలేదు. అందుచే నీయుద్ధములో జయాపజయము లెవ్వరి పాలును గాలేదు.

హరిహరరాయలుకు దేవరాయలు గాక రెండవ విరూపాక్షరాయలను కుమారుఁడు గూడ గలఁడు.

ఈ హరి హరరాయలు శాసనములాంధ్రదేశముననే గాక మైసూరు, ధార్వాడ, కాంచీనగరము, చెంగల్పట్టు, తిరుచునాపల్లి, మొదలగు చోట్లనుగూడ కనుబడుచున్నవి. దీనిని బట్టియే యాతని రాజ్యమెంత విస్తారమైనదియో గ్రహింపవచ్చును. మొత్తముమీద నీతని రాజ్యము జనరంజకమైనది. ఇతఁడు 1377 మొదలు 1404 వరకు రాజ్యపాలనమొనర్చెను.

---

13. దేవరాయలు.

విజయనగర సామ్రాజ్యమును రెండవ హరిహరరాయల మరణానంతర మాతని జ్యేష్ఠకుమారుఁడగు దేవరాయలు పాలించెను. ఈ రాజ్యాధిపత్యము విషయమై హరిహరరాయల రెండవ కుమారుఁడగు విరూపాక్షరాయలకు నీతనికి మొదట పోరాటము గల్గెను. గాని వీరుభయులు

రెండు సంవత్సరములు పోట్లాడినపిదప దేవరాయలె సింహాసన మాక్రమించెను. ఇతఁడు తన తండ్రికాలమున నుదయగిరి రాజ్యపాలకుఁడుగా నుండెను. అప్పుడీయన యువరాజు.

ఈయనవద్ద లక్కనమంత్రి యనువాఁడు ప్రధానిగ నుండెను. ఇతఁడు మాధవసాయనుల తోబుట్టువగు సింగాంబ కుమారుఁడు. దేవరాయలు కోటలో నున్నపుడొకసారి రాజద్రోహులాయనను జంపుటకై వాడికత్తులతో సింహాద్వారము జొచ్చిరి. అప్పుడీతఁడే వారలను బట్టుకొని సంహరించి రాయలను రక్షించెను. దేవరాయలకు హరిహరుఁడు, విజయుఁడు, మల్లన యను మువ్వురు పుత్త్రులు గలరు. దేవరాయలు విజయనగరము వచ్చినతరువాత తన కుమాళ్ళలో విజయరాయల నుదయగిరి రాజ్యపాలకునిగా నియమించెను. విఠ్ఠన్న యను నొక పరాక్రమశీలు నరగడ రాజ్యపాలకునిగా నియమించెను. మఱియు ములువాయి రాజ్యమును నాగన్న దండనాయకుని, గోలెగుత్తి రాజ్యమున విరూపదండనాయకుని, బరకూరు రాజ్యమున శంకరదేవ యొడయరును, చంద్రగుత్తి రాజ్యమున మల్లప్పను, భవానీ నదీప్రాంత దేశమునకు తన కుమాళ్ళగు హరిహరయొడయలు, వీరమల్లన్నయొడయలను ప్రతినిధిపాలకులనుగా నేర్పాటుచేసి తాను విద్యానగరమున నుండి పాలించెను. దేవరాయలు విజయరాయలును యువరాజుగా జేసెను.

ఈయన విజయనగరము చుట్టును ప్రాకారములు, బురుజులు గట్టించెను. నగరవాసుల సౌకర్యార్థమై తుంగభద్రా నది కానకట్టగట్టి, నగరములోని కొక కాలువను ద్రవ్వించెను. ఆ నీటి సౌకర్యమువలన పట్టణములో ననేక పుష్పోద్యానము లేర్పడి ఫలవంతములగు ద్రాక్షతోటలు మున్నగునవికూడ పెంపఁబడెను. వీని మూలమున నా పట్టణమునకు పన్నెండు లక్షల రూప్యముల యాదాయము వృద్ధి యయ్యెను. ఈతన్నగరము నశించినను, కాలువ మాత్రమిప్పటికిని సురక్షితముగా నిలచియున్నది ఇది యిప్పటి శిల్పశాస్త్రజ్ఞులకు గూడ నాశ్చర్యము గలిగించుచున్నది. ఈ కాలువవలెనే వ్యవసాయాభివృద్ధికై గూడ దేవరాయలు తన రాజ్యములో ననేక పంట కాల్వలను ద్రవ్వించెను.

దేవరాయలకును బహమనీ సుల్తానునకు గూడ నెప్పటి యట్లు రాజ్యవైరముండెను. ఈసుల్తానగు ఫెరోజిషాహా క్రీ॥ శ॥ 1417 సం॥ లో పద్మనాయకుల రాజ్యములోని పానుగల్లు దుర్గమును వశపఱచుకొనుటకై దండెత్తిపోయి రెండు సంవత్సరములు పోరాడిజయింపఁజాలక పలాయనుఁడయ్యెను. ఈ సమయము గనిపెట్టి దేవరాయలాతనిపై దండెత్తెను ఉభయసైన్యములకును ఘోరమైన యుద్ధము జరిగెను. అప్పుడు. సుల్తాను పారిపోవుటయే దుస్థిరమయ్యెను. హిందువులంతట సుల్తానును వెంబడించి యతని రాజ్యములో ననేకులను సంహరించిరి. అదివరకు మహమ్మదీయులు పెట్టుబాధలకన్నిటికిని వడ్డీతో సరిపోవునట్లుగా నప్పుడు హిందువులు వారి రాజ్యములో దోచుకొనిరి. ఈమనోవ్యాధితోనే సుల్తాను 1422 సం॥ లో చనిపోయెను.

దేవరాయల యాస్థానములో డిండిమకవి సార్వభౌముడుండెను. ఆతఁడు తనతో సాటివారు లేరను గర్వముతో నొక కంచుఢక్కనుంచుకొని తనను జయించినచో దానిని బగులఁగొట్టెదనని మోగించుచుండెను. ఈవార్తవిని శ్రీనాధమహాకవి దేవరాయల యాస్థానమున కేగి యచ్చటి డిండిమకవిని వాదములో నోడించెను. నిష్పక్షపాతియగు దేవరాయలు తన యాస్థానకవియని మోమోటపడక వెంటనే డిండిమకవికంచుఢక్కను బగులగొట్టించి శ్రీనాధునికి కనకాభిషేకము జేసెను. అందువల్ల నీతని విద్యాభిమానము, న్యాయైకదృష్టియు గోచరించుచున్నవి.

ఇతఁడు క్రీస్తుశకము1406సం॥ మొదలుకొని 1422సం॥ వరకు రాజ్యపాలన మొనర్చెను. తరువాత నితని కుమారుడు వీరవిజయబుక్కరాయలు సింహాసన మధిష్టించెను.

———

14. రెండవ దేవరాయలు.

విజయనగర సామ్రాజ్యము దేవరాయల యనంతరము విరవిజయ బుక్కరాయలొక్క సంవత్సరము మాత్రమే పాలించి తరువాత మరణించెను. అందుచే నాతని కుమారుఁడగు రెండవ దేవరాయలు తండ్రి సింహాసన మధిష్ఠించెను.

ఈతనివద్ద తెలుగురాయఁడు పంటమైలారరెడ్డియును సామంతమండలేశ్వరులుండిరి. వీరిద్దఱిసహాయమువలననేనితఁడు తన రాజ్యమును వృద్ధిపఱచెను. ఇతని కాలములో కొండవీడు వినుకొండరాజ్యములు, విజయనగర రాజ్యాధిపత్యమునకు లోఁబడి కప్పములు చెల్లించెను. ఇంకను కందుకూరి రెడ్డిరాజులును పద్మనాయకులు గూడ నీతనికి కప్పములు చెల్లించుచు సామంతమండలాధిపులుగా నుండుచు వచ్చిరి. ఈయనకు ప్రౌఢదేవరాయలు, ఇమ్మడిదేవరాయలు, గజవేంటదేవరాయలు ప్రతాపదేవరాయలను నామాంతరములు గలవు. ప్రౌఢదేవరాయలు తురుష్కులతోడను, గజపతులతోడను తఱచుగా యుద్ధమొనరించుచుండెను. ఈయుద్ధములలో గూడ మైలారవిభుఁడాతనికిఁ దోడ్పాటుగానుండి జయలక్ష్మిఁ జేకొనుచు వచ్చినందున నాతనిమీద ప్రౌఢదేవరాయలకు సంతోషము గల్గి యాతని కేమికావలయునో కోరుకొమ్మనెను. అందుచే నాతఁడు తన పేరున నొక యగ్రహార మిచ్చుటకు గోర్కె యున్నదని తెల్పెను. దానికి ప్రౌఢదేవరాయలు సమ్మతింపగా

నతఁడు పూరినాటిలో గుండ్లకమ్మ యొడ్డున నున్న పోలవరమను గ్రామమునకు చేజెర్లయను పేరుపెట్టి బ్రాహ్మణులకగ్రహారముగా ధారవోసెను. ప్రౌఢదేవరాయలకు క్విలన్, శిలోన్, పిలికట్, పెగో, టెనాసిరం మొదలగు విదేశరాజులు గూడ కప్పములు చెల్లించుచు వచ్చిరి. ఇతనివద్ద ప్రసిద్ధమైన దండనాయకులుండిరి. అందులో లక్కనదండనాయకుఁడు సింహళమువరకుఁ గల రాజగంభీరరాజ్యమునకు ప్రతినిధిపాలకుఁడుగాను, అన్నపుదండనాథుఁడు, మంగటూరు, బరకూరు రాజ్యప్రతినిధి పాలకుఁడుగాను నుండిరి.

ప్రౌఢదేవరాయలవద్ద యుద్ధసమయములలో నేడులక్షలసైన్యమును తదితరసమయములలో 3 లేక 4 లక్షల సైన్యమునుండెను. ఇంత సైన్యమును బోషించుచు దఱచుగా యుద్ధములనేకము జేయుచున్నను, రాయలు తన ధనాగారములో 225 కోట్ల రూపాయలను నిల్వఁజేయఁగల్గెను.

ఈతని యాస్థానమునకు విదేశరాయభారులు తఱచు వచ్చుచుండిరి. పారసీకదేశ చక్రవర్తియగు షాహరుఖ్ యనునాతఁ డబ్దుల్ రజాకనువానిని, పోర్చుగల్లుదేశపురాజు నికోలో డెయికోంటియనువానిని రాయభారులగా నీతనికడకుఁబంపుచు వచ్చిరి.

ప్రౌఢదేవరాయలు హరిద్రా యనునానకట్టను బాగు చేయించెను. ఇతఁడు వ్యవసాయాభివృద్ధికై తన దేశములోఁ బెక్కు పనులను చేసెను.

ఈతని తమ్ముఁ డొకఁడీయనమీఁద నీర్ష్య వహించి యాతనిం జంపి తాను రాజుగావలె నని నిశ్చయించుకొని తా నొక నూతన భవన నిర్మాణముజేసి యా గృహప్రవేశ మహోత్సవకాలమున నొక విందు జరిపెను. అప్పుడు ప్రౌఢదేవరాయలు నాతని మంత్రులు సేనానులు నాహూతులైరి. ఆ కాలములో మర్యాదల ననుసరించి వారి వారి హోదాలనుబట్టి ప్రత్యేకస్థలములలో విందుయేర్పాట్లు జరుపబడి యెక్కడివారక్కడనే జంపబడిరట. ఈ కోలాహలము వినబడకుండుటకై మందిరములో దుందుభులు, నగారాలు పిల్లనగ్రోవులు మున్నగువాయిద్యములు మ్రోగింపబడుచుండెనట. అదృష్టవశమున రాయలానాడు విందునకు రాజాలననియు దన నాడిన మస్వస్థతగా నున్నదనియుఁ, బిలువవచ్చిన తమ్మునితో బల్కెనఁట. వాఁడు తన ప్రయత్నమంతయుఁ జెడిపోయె నను క్రోధముతోడను, చింతతోడను వెంటనే తనవద్దనున్న కత్తితో రాయలను బొడిచిపోయి యాతఁడు మరణించె నను నూహతో తలను గోయుమని యొకసేవకుని కానతిచ్చి తానే రాజునని ప్రకటించెనఁట.

అంతట కొంతసేపటికి ప్రౌఢదేవరాయలు తెప్పరిలలేచి తననుజంపవచ్చు భటునితలఁ దెగనఱికివచ్చి తానుసజీవుఁడుగా నున్నట్లచ్చటి వారికిఁ దెల్పి రాజద్రోహిని బట్టుట కాజ్ఞనిచ్చెనఁట. అప్పుడా రాజద్రోహిని, వానిగుంపులో జేరిన వారి

నందఱిని బట్టితెచ్చి దేవరాయలు వారికి మరణశిక్షలు విధించి తన్మూలమువలన నగరములో రాజద్రోహ వృత్తిలేకుండఁ జేసెను.

1435 సం॥లో మహమ్మదుషాహా మృతిఁబొందఁగా నాతని కుమారుఁ డల్లాయుద్దీన్‌షాహా బహమనీ రాజ్యాధిపతి యయ్యెను. ఇతఁడు పట్టాభిషిక్తుండైన తోడనే రాయల మీఁదికి తన సోదరుఁడైన మహమ్మదుఖానునకు కొంతసైన్యమిచ్చి యుద్ధము జేయుటకై పంపెను. కాని యిప్పుడు దేవరాయలు వానితో సంధి కుదుర్చుకొనెను. తరువాత మహమ్మదు తన యన్నమీఁదనే తిరుగఁబడి దేవరాయల సహాయముతో ముదిగల్లు, రాచూరు, విజాపురము మున్నగు దుర్గముల నాక్రమించుకొనెను. గాని తరువాత మఱొకసారి వాని సోదరునితో యుద్ధముజేసి యోడి పలాయనసూత్ర మవలంబించెనఁట. అటుపిమ్మట సుల్తాను వాని యపరాధమును మన్నించి వానికి రాచూరు దుర్గాధిపత్య మిచ్చెనఁట.

విజయనగరమున రాజద్రోహులు చెలరేగిన సంగతి విని బహమనీసుల్తాను తనకు రాయ లేడులక్షల వరహాల కప్పము గట్టనిచో దండెత్తివత్తునని యొకసారి కబురంపెనఁట. దానికి ప్రౌఢదేవరాయలు లక్ష్యపెట్టక తనసేనలంగూర్చుకొని సుల్తానుపైకి దండయాత్ర వెడలెను. అతఁడు తుంగభద్రానది దాటి ముదిగల్లు, రాచూరు, వెంగాపురము దుర్గములను బట్టుకొని సాగరువిజాపురమువరకుఁ గల దేశమంతయుఁ గొల్ల

వెట్టి సుల్తాను రాజ్యమల్లకల్లోలము గావించుచుండెను. అప్పుడు సుల్తాను సేనాధిపతులు తమతమ సైన్యములతో వచ్చి యుద్ధము జేసిరి. గాని యీ యుద్ధములో తురుష్కులకే విశేష సైన్యనష్టమగుటయు, జయాపజయములు తేలకుండుటచేతను తుద కొండొరులకు నష్టములేకుండ సంధి గావించుకొనబడెను.

ప్రౌఢదేవరాయని కాలములో కన్యాశుల్కదురాచారములు ప్రజలలో ప్రబలెను. ఇవి విశేషముగా బ్రాహ్మణులలో వ్యాపించియుండెను. వీటిని జూచి సంస్కర్తలగు కొందరు ఘూర్జరాంధ్ర, కర్ణాట, ద్రావిడ బ్రాహ్మణులేకమై కన్యాశుల్కమును గ్రహించినవారికి శిక్షలు కలుగజేయు శాసన మొకటి నిర్మింపుమని 150 మంది చేవ్రాళ్లుజేసి ప్రౌఢదేవరాయనికి విన్నపమంపుకొనంగా రాయలట్లే శాసనముం గావించెను.

ఈ దేవరాయలకు పొన్నలదేవి, సింహళదేవి యను యిర్వురుభార్యలుండిరి. పొన్నలదేవికి మల్లికార్జునరాయలు, సింహళదేవికి విరూపాక్షరాయలను కుమాళ్ళు గలిగిరి. ప్రౌఢదేవరాయలు క్రీస్తుశకము 1423 సం॥ మొదలుకొని 1446 సం॥వరకును రాజ్యము పాలించి స్వర్గస్థుడయ్యెను. తరువాత నాతని కుమారుడు మల్లికార్జునరాయలు సింహాసనారూఢుండయ్యెను.

రామా వాచకములు.

జి. దామోదరం మొదలియార్, బి. ఎ , ఎల్. టి., డి. ఇ. ఒ. &
పి. యస్. రామశర్మ, బి.ఎ., ఎల్.టి. గార్లచే

మొదటి తరగతి ...	అప్పృవుడు	(9-4-29)	0	2	6
రెండవ తరగతి ...	...		0	3	0
మూాండవ తరగతి	...		0	4	0
నాల్గవ తరగతి ...	...	,,	0	5	0
ఐదవ తరగతి ...	...	,,	0	6	0

హితోపదేశ వాచకములు.

విద్వాన్ గ. సోమన్న పంతులు, ఎం. ఏ., ఎల్. టి. గారిచే

రెండవ తరగతి ...	...	...	0	2	0
మూాండవ తరగతి...	...	...	0	3	0
నాల్గవ తరగతి ...	...	...	0	4	0
ఐదవ తరగతి ...	...	...	0	5	0

పురాణ పాఠములు.

వేపా వరాహనరసింహము పంతులు, ఎం. ఏ. &
మల్లాది. సూర్యనారాయణశాస్త్రి గార్లచే

మొదటి తరగతి ...	...	...	0	2	6
రెండవ తరగతి ...	...	...	0	2	6
మూాండవ తరగతి...	...	...	0	3	0
నాల్గవ తరగతి ...	...	...	0	4	0
ఐదవ తరగతి ...	...	...	0	5	0

వలయువారు:—రామా అండ్ కో., ఏలూరు.

END OF
TITLE